క్లుప్తంగా

ఆలయాల పునర్నిర్మాణానికి రేపు భూమి పూజ

- రూ.2. 50 కోట్లతో పనులు

తాడిపత్రి: నియోజకవర్గంలో శిథిలావస్థకు చెందిన రెండు ఆలయాల పునర్నిర్మాణ పనులకు సంబంధించి శుక్రవారం ఉదయం భూమి పూజ నిర్వహించనున్నారు. మండలంలోని చిన్నపొలమడ చెన్నకేశవస్వామి ఆలయం, పెద్దపప్పూరు మండలం పప్పూరమ్మ ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ప్రభుత్వం నుంచి చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు గాను రూ.1.50 కోట్లు, అలాగే పప్పూరమ్మ ఆలయానికి రూ.కోటి నిధులను మంజూరయ్యాయి. భూమి పూజకు వైఎస్సార్ సీపీ యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరు కానున్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులో నిబంధలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైష్ణవి స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వరుణ్‌కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిప్రతం సమర్పించారు. పాఠశాలలో కనీస సదుపాయాలు లేవని పేర్కొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యమే లక్ష్యం

గుంతకల్లు రూరల్: తల్లీబిడ్డ ఆరోగ్యమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదా పేర్కొన్నారు. బుధవారం ఆమె నెలగొండ, మల్లేనిపల్లి అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణను సమీక్షించారు. అంగన్‌వాడీ టీచర్లు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ పని చేయాలన్నారు. మెనూ ప్రకారమే సెంటర్లలో వంట వండాలని సూచించారు.

ఆటో దగ్ధం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని బండి మోటు వీధిలో నిప్పుపెట్టడంతో ఆటో దగ్ధమైంది. వివరాలు.. రమేష్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ఇంటి ముందు ఆటో పెట్టి ఇంటిలో నిద్రించాడు. బుధవారం ఉదయం లేచి చూసే సరికి ఆటో కాలిపోయింది. వెంకటేష్ చిన్నా అనే వ్యక్తులు ఆటోకు నిప్పు పెట్టారని బాధితుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళా హక్కుల కోసం పోరాడదాం

గుంతకల్లు రూరల్: మహిళా హక్కుల కోసం పోరాడుదామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి పద్మావతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు లైంగిక వేధింపులు, అత్యాచారాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళా హక్కుల సాధనకు అందరూ సిద్ధం కావాలన్నారు. మహిళ లేనిదే సృష్టి లేదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించేలా పోరాటం సాగించాలన్నారు.

వలంటీర్‌పై టీడీపీ నాయకుల దాడి

బుక్కరాయసముద్రం: నార్పల మండలం దుగుమర్రి గ్రామంలో ఓ వలంటీర్‌పై టీడీపీ నాయకులు దాడి చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దుగుమర్రి గ్రామానికి చెందిన వలంటీర్ శివారెడ్డి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ వద్ద కూర్చుని విధులు నిర్వహిస్తుండగా అదే సమయంలో టీడీపీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, జయసింహారెడ్డి వన్‌బీ కావాలని అడిగారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్ ఆడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారని వలంటీర్ శివారెడ్డి సమాధానం ఇచ్చాడు. దీంతో అసభ్య పదజాలంతో నీవు ఇక్కడ ఎందుకు ఉన్నావని హేళన చేశారు. ఈక్రమంలో మాటామాటా పెరిగి టీడీపీ నాయకులు వలంటీర్‌పై దాడి చేశారు. వలంటీర్‌తోపాటు సచివాలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజశేఖర్‌రెడ్డి, జయసింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు నార్పల ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో పెద్దపప్పూరుకు చెందిన నాగరాజు అనే కానిస్టేబుల్ మృతి చెందాడు. 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ మిత్రులు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య లలితకు రూ.80 వేలు, తల్లి లక్ష్మీనారాయణమ్మకు రూ.81 వేల ఆర్థికసాయం చేశారు.ఆర్థిక సాయం అందించిన వారిలో సూర్యనారాయణ, పెద్దన్న, రవి, వెంకటేష్ నాయక్, మురళి, జగన్, ప్రేమనాథ్ రెడ్డి ఉన్నారు. ఈసందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు.

వైభవం.. వేంకటేశ్వరుడి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, తహసీల్దారు, ఎస్ఐ తదితరులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యల్లనూరు: మండల కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అధిష్ఠింపజేశారు. ప్రత్యేక పూజల అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం రథోత్సవం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మైన్ బజార్ మీదుగా పాతపేటకు చేరుకొని అక్కడ నుంచి వెనుతిరిగి రథం దేవాలయానికి చేరుకుంది. ఈసందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా యల్లనూరు, పుట్లూరు ఎస్ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

యాడికి: స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సొసైటీ ప్రెసిడెంట్ కొట్టే వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికి, వేమలపాడు సొసైటీల ద్వారా రైతులు పండించిన పప్పుశనగను ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మద్దతు ధర క్వింటాల్ రూ 5,335తో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. పప్పుశనగ రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏఓ ఆంజనేయులు పరిశీలించారు. ఇప్పటి వరకు దాదాపు 250 క్వింటాళ్ల పప్పుశనగను కొనుగోలు చేసినట్లు జూటూరు సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి తెలిపారు. ప్రయివేటు వ్యాపారుల కన్నా ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తోందన్నారు. ఈనెలాఖరువరకు పప్పుశనగను కొనుగోలు చేస్తామని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పప్పుశనగను పరిశీలిస్తున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

న్యాక్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా న్యాక్(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, జిల్లా అధికార ఆనంద్ రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. న్యాక్, , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ సర్వేయర్, ప్లంబింగ్, శానిటేషన్ విభాగాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. టెన్త్ ఆపై చదివిన యువతీ యువకులు ఈనెల 30వ తేదీ లోపు న్యాక్ సెంటర్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం

గుత్తి: పట్టణంలో బుధవారం ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్, మహాత్మా జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 756 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 721 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను అనంతపురం డీవీఈఓ వెంకటరమణనాయక్ తనిఖీ చేశారు.

గుంతకల్లుటౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని శ్రీశంకరానంద, శ్రీసరస్వతీ, నారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మొదటిరోజు జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఫస్ట్ లాంగ్వేజీ(తెలుగు,హిందీ, ఉర్దూ,సంస్కృతం) పరీక్షకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 625కి మంది విద్యార్థులకు గానూ 3 గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సాలాబాయి తెలిపారు. శ్రీశంకరానంద ఎయిడెడ్ కళాశాలలో 379 మంది విద్యార్థులకు గానూ 9 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. ఇక శ్రీసరస్వతీ జూనియర్ కళాశాలలో 250 మందికి గానూ ముగ్గురు గైర్హాజరయ్యారు. నారాయణ కళాశాలలో 233కి గానూ 4 విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలియజేశారు. పరీక్ష కేంద్రాలను గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన ఆదేశించారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్ పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : పట్టణంలో బుధవారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ తెలుగు, సంస్కృతం పరీక్షకు 1,194 మంది విద్యార్థులు హాజరుకాగా 47 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 259 మంది, ప్రభుత్వ మోడల్ స్కూలులో 248, సీవీరామన్ జూనియర్ కళాశాలలో 212, టెక్ జూనియర్ కళాశాలలో 234, వాణి జూనియర్ కళాశాలలో 240 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు.

యాడికి: మండలంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 106 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల చీఫ్ మారుతి, డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మోడల్ స్కూల్‌లో 41 మంది, జేసీ దివాకర్ రెడ్డి కళాశాల నుంచి 65 మంది ఇంటర్ విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరయ్యారన్నారు.

పామిడి: పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రశాంతంగా జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 306 మంది విద్యార్థులకుగాను 301 మంది హాజరయ్యారు. పరీక్షలకు చీఫ్‌గా ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నాగరాజు వ్యవహరించారు. ఈ పరీక్ష కేంద్రాన్ని డీవైఈఓ వెంకటరమణనాయక్ తనిఖీ చేశారు.



గుంతకల్లుటౌన్: పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప



తాడిపత్రి టౌన్ : హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

కుష్టు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని డాక్టర్ రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో శాంపిల్స్ సర్వే కమ్ అసెస్మెంట్ టీం(గుంటూరు) ఆధ్వర్యంలో కుష్టు నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ కుష్టుపై గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. అనుమానిత కేసులు ఉన్నట్లు తెలిస్తే పీహెచ్‌సీకు శాంపిల్స్ పంపించాలన్నారు. వైద్య సిబ్బంది ఈ సర్వేను ఈ నెల 18 నుంచి చేపట్టాలన్నారు. ప్రారంభ దశలో ఉన్న కేసులు గుర్తించి చికిత్స అందించి అంగవైకల్యం రాకుండా కాపాడాలన్నారు. చర్మంపై రాగి రంగు మచ్చలు ఉన్నవారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపాలన్నారు. కార్యక్రమంలో మండల డాక్టర్ స్వాతి లక్ష్మి, డీపీఎంఓ బాల ఓబులు, సీహెచ్ఓ మోహన్‌రావు, నోడల్ ఆఫీసర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రామిరెడ్డి

వృద్ధురాలిపై కుక్క దాడి

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో బుధవారం గౌరమ్మ అనే వృద్ధురాలిపై కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు ఆమెను స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల పట్టణంలో కుక్కల బెడద అధికమైంది. దీంతో వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుడిపై..

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో బుధవారం కుక్క కాటేయడంతో సాయిచరణ్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయి చరణ్ ట్యూషన్‌కి వెళ్లి ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. బాలుడిని గమనించిన స్థానికులు బిగ్గరగా కేకలు వేయడంతో కుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాలుడిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కన్నప్పస్వామి శివైక్యం

బుక్కరాయసముద్రం: ముసలమ్మకట్ట సమీపంలోని రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణకర్త కన్నప్పస్వామి(94) బుధవారం శివైక్యమయ్యాడు. కన్నప్పస్వామి సొంతూరు తమిళనాడులోని రాజీపాలెం. ఈయన 18వ ఏట తన కుటుంబీకులను వదిలేసి సన్యాసం స్వీకరించారు. 20 ఏళ్ల పాటు శ్రీకాళహస్తి, 10 ఏళ్ల పాటు కర్ణాటకలో ఉన్నారు. తన 50వ ఏట నగరానికి వచ్చిన ఈయన ఓంస్వామి బృందంలో సభ్యుడిగా ఉన్నారు. 1993లో ముసలమ్మ కట్ట వద్ద సిద్ధి వినాయక స్వామి, రాజరాజేశ్వరి ఆలయాన్ని నిర్మించి, తనతో పాటు 20 మంది సాధువులకు నిత్యాన్నదానం చేసేవారు. బుధవారం మధ్యాహ్నం శివైక్యమైనట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు సతీష్‌కుమార్, చంద్రోశేఖర్, నిర్మలమ్మ తెలిపారు. సాయంత్రం ఆలయ సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశామన్నారు.



కన్నప్పస్వామి(ఫైల్)

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించాలని నిరసన

గుత్తి రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు బుధవారం పట్టణంలోని తహసీల్దార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో వారు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహబూబ్‌బాషా, పీఆర్ డీఈ మురళీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న డీఆర్ అరియర్లను సత్వరమే విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్సీ, పే ఫిక్సేషన్లను ఇవ్వాలన్నారు. డీటీ శ్రీలత, ఆర్ఐ సందీప్, జేఏ శంకర్, వీఆర్ఓలు రంగయ్య, నాగరాజు, పవిత్ర, శారద, నాగరత్న పాల్గొన్నారు.

ఆలయ హుండీలో నగదు అపహరణ

గుంతకల్లు రూరల్: తిమ్మాపురం గ్రామం వద్ద వెలసిన మిటు భుక్యానాయక్ ఆలయంలో మంగళవారం రాత్రి దుండగులు చొరబడి హుండీలోని నగదును అపహరించుకెళ్లారు. ఏటా ఉగాది తర్వాత హుండీ కానుకల లెక్కింపును చేపడుతుంటారు. ఈ క్రమంలో గత ఏడాది హుండీ లెక్కింపులో రూ.2.5 లక్షల ఆదాయం సమకూరింది. ఈ లెక్కన ఏడాది అంతకన్నా ఎక్కువ మొత్తం ఉండవచ్చునని ఆలయ పూజారి కృష్ణానాయక్ అంచనా వేశారు. కాగా, దుండగులు తొలుత ఆలయ ప్రాంగణంలోని గదిలో నివాసముంటున్న పూజారి గది తలుపునకు తాళం వేసి, హుండీని బద్దలుగొట్టి నగదు అపహరించుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తా పడిన వాహనం

యాడికి: మండల కేంద్రంలో టెంకాయల లోడుతో పోతున్న బొలెరో వాహనం వైన్‌షాపు వద్ద ఉన్న మలుపులో కాలువ వద్ద బుధవారం ఉదయం బోల్తా పడిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. మండల కేంద్రంలోని కుంటలో ఉన్న మండీ వద్దకు టెంకాయల లోడుతో బొలెరో వాహనం బయలుదేరింది. వైన్‌షాపు వద్ద ఉన్న మలుపులో కాలువ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో అక్కడున్న చక్రాల బండి వద్దనున్న చిరువ్యాపారులు పక్కకు పోవడంతో ప్రమాదం తప్పింది.

విద్యార్థులకు గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో మంగళవారం రాత్రి బైక్‌పై నుంచి పడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన జాఫర్, సాయి బైక్‌పై కర్నూలు రోడ్డుకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జగనన్నను జీవితాంతం గుర్తుంచుకుంటాం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆలయాల్లోని కల్యాణకట్టల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు ఉద్యోగ భద్రత కల్పించారని, ఆయన్ను జీవితాంతం గుర్తుంచుకుంటామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాలు, పాలకులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఉపాధి కూలీల హాజరు పెంచండి

పెద్దవడుగూరు : ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని పెంచాలని తాడిపత్రి ఏపీడీ వెంకటరత్నం , ఎంపీడీఓ కుళ్ళాయిస్వామి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవ్వరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. వ్యవసాయానికి అనుసంధానంగా ఉండే పనులను చేపట్టడం ద్వారా రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. భూగర్భ జలాలు పెంచేలా గుంతలు తవ్వకాలు చేపట్టాలన్నారు. ఏపీఓ పుల్లారెడ్డి, జయరామ్‌రెడి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించండి

గుత్తి రూరల్: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీఓ మద్దిలేటితో కలిసి మండలంలోని ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోజు ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు వేసవి దృష్ట్యా వసతులు కల్పించాలన్నారు. పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచడంతోపాటు పనుల లక్ష్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏలు చెన్నారెడ్డి, రత్నాలు, మైసూరారెడ్డి, లోకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

గుత్తి: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని పెద్దవడుగూరు ఎస్ఐ రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు అలవాటు పడి లోన్ యాప్స్ ద్వారా అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని చితికిపోతున్నారన్నారు. అప్పులు తీర్చలేక విద్యార్థులు కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతగా నడుచుకోవాలన్నారు. డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లద్దన్నారు. బాగా కష్ట పడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిర పడాలని సూచించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ వీకే వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

నీట్‌లో తాడిపత్రి విద్యార్థిని ప్రతిభ

తాడిపత్రి టౌన్: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్ పీజీ) 2023 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసింది. ఇందులో పట్టణానికి చెందిన శివజ్యోతిక (హాల్ టికెట్ - 2366100923) 569 మార్కులతో 5,516 ఆల్ ఇండియా ర్యాంకు సొంతం చేసుకుంది. శివజ్యోతిక 2016లో తెలంగాణ ఎంసెట్ మెడికల్ ఫలితాల్లో 65వ ర్యాంకుతో హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించి, హౌస్ సర్జన్‌గా చేస్తోంది. శివజ్యోతిక తండ్రి రామాంజనేయులు తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి ప్రాథమిక పాఠశాలలో, తల్లి పద్మావతమ్మ వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం దత్తాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. శివజ్యోతికకు ఉపాధ్యాయ సామాజిక సేవాసంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, కార్యదర్శి కార్యదర్శి శంకర్, కన్వీనర్స్ చెన్నకేశవులు, శ్రీరంగయ్య అభినందలు తెలిపారు.



శివజ్యోతికకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కాన్షీరామ్ ఆశయ సాధనకు పాటుపడదాం

గుంతకల్లుటౌన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ ఆశయ సాధనకు పాటుపడదామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కాన్షీరామ్ 89వ జయంతి వేడుకలను నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాధికార సాధనే ధ్యేయంగా బీఎస్పీని సాధించిన కాన్షీరామ్ గొప్పతనాన్ని చాటి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, నాయకులు పరుశురామ్, రిజ్వానా, హుసేన్, ఎర్రిస్వామి, బాషా తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 89 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నేతలు తూర్పింటి ఓబులేసు, చెంచొళ్ళ రమేష్, మాలమహానాడు వెంకటాచలపతి కాన్షీరామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహన యజమానిపై కేసు నమోదు

యాడికి: బైక్‌ను ఢీకొన్న ఘటనలో బొలెరో వాహన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు. గత నెల 7న రాయలచెరువు గ్రామానికి చెందిన బిందుసాగర్ నాయుడు(24) తన స్నేహితుడు రమణతో కలిసి తిరుగు ప్రయాణంలో యాడికి నుండి తన ద్విచక్ర వాహనంలో రాయలచెరువుకు బయలుదేరాడు. వీరారెడ్డిపల్లెకు చెందిన వాసుదేవరెడ్డి తన బొలెరోలో రాయలచెరువు నుంచి యాడికికి పోయే క్రమంలో బైక్‌ను ఢీకొన్నాడు. ఘటనలో బిందుసాగర్‌నాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

మామిడి చెట్లు దగ్ధం

గుత్తి రూరల్: ఊటకల్లు గ్రామంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రైతు రామకృష్ణారెడ్డికి చెందిన మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు రామకృష్ణారెడ్డి సర్వే నంబర్ 203లో ఉన్న 1.25 ఎకరాల్లో 16 సంవత్సరాల క్రితం మామిడిమొక్కలు పెట్టాడు. అయితే బుధవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పొలం పక్కన ఉన్న పిచ్చి గడ్డిపై పడేయడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు రైతు రామకృష్ణారెడ్డి పొలంలోకి వ్యాపించి గట్టు పక్కన ఉన్న 30 మామిడి చెట్లతో పాటుగా మామిడి కాయలు సైతం మంటల్లో కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకూ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు.